క్లుప్తంగా

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న సంజీవరావు, నాగమణి దంపతులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం పాటిపల్లికి చెందిన యల్లపు సంజీవరావు, నాగమణి దంపతులు రూ.50,049 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

6న ఉమ్మలాడలో దేవీతల్లి ఆలయ ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో ఈ నెల 6వ తేదీన దేవీతల్లి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. భక్తిశ్రద్ధలతో మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల విరాళాలతో నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడు, కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎండుతున్న వరినాట్లు



చినగుమ్ములూరు పొలాల్లో ఎండుతున్న వరినాట్లు

ఎస్.రాయవరం: వర్షాభావంతో మండలంలో ముందుగా వేసిన నాట్లు ఎండుతున్నాయి. ఖరీఫ్‌కు ముందుగా కురిసిన వర్షాలకు గత నెలలో చిగుమ్ములూరు, పెట్టుగొళ్లపల్లి, భీమవరం తదితర గ్రామాల్లో ముందుగా నాట్లు వేశారు. 15 రోజులుగా చినుకు పడక పోగా ఎండలు మెండుగా కాస్తున్నాయి. దీంతో వేసిన నాట్లు పూర్తిగా ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో ఇప్పటికే నారుమడులు ఎండుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు నాట్లు కూడా ఎండుతుండటంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

అచ్యుతాపురం రూరల్: మండలంలోని కొత్త మోసయ్యపేట గ్రామంలో మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో 100 అడుగుల మట్టి గణపతి విగ్రహం



120 అడుగుల వినాయక మండపం వద్ద నిర్వాహకులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 100 అడుగుల వినాయక భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, సంపత్ వినాయక ఉత్సవ కమిటీ వ్యవస్థాపకుడు బుద్ద భూలోకనాయుడు తెలిపారు. ఆదివారం ఇక్కడ విగ్రహ నమూనాను ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విగ్రహాన్ని పూర్తిగా మట్టితో లక్ష్మీగణపతి అవతారంలో తయారు చేయిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇంతపెద్ద విగ్రహం ఎప్పుడు ఏర్పాటు చేయలేదన్నారు. తాపేశ్వరం లడ్డూను తీసుకొచ్చి స్వామివారి వద్ద ప్రత్యేక ఆకర్షణగా ఉంచుతామన్నారు. 120 అడుగుల ఎత్తులో పందిరి నిర్మిస్తున్నామన్నారు. 21 రోజుల పాటు గణపతికి ప్రత్యేక పూజలు, ప్రత్యేక హోమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఉగాది పురస్కార్ గ్రహీత, శిల్పి కామదేనువుప్రసాద్, సివిల్ ఇంజనీర్ బి.భానుప్రకాష్ పర్యవేక్షణలో భారీ విగ్రహ పనులు జరుగుతున్నాయన్నారు. 21 రోజులు స్వామివారి పూజలు అనంతరం స్థానికులు, ఫైర్ ఇంజన్ అధికారుల సహకారంతో ఎన్టీఆర్ క్రీడా మైదానంలో గణపతి నిమజ్జనం చేస్తామన్నారు. కమిటీ సభ్యులు వాకాడ నర్సింగరావు, మద్దాల భాను, ముత్తా ఈశ్వరరావు, పి.గోవిందరావు, యల్లపు రాము, పిల్లా దుర్గాఆనందం, ఆళ్ల ప్రవీణ్, కాండ్రేగుల రవి, కె.కనకమహాలక్ష్మి, బి.జయంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం ఘనం.. పనులు శూన్యం

- ప్రకటనలకే పరిమితమైన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర
- దుర్గంధం మాటున కాలనీలు
- వెంకటనగర్ కాలనీని వెంటాడుతున్న సమస్యలు



అధ్వానంగా ఉన్న వీధి కాలువలు



ఇళ్ల ముందు నిలిచిపోయిన మురుగు నీటిని చూపిస్తున్న మహిళలు



వెంకటనగర్‌కాలనీలో ప్రధాన కాలువ దుస్థితి

నక్కపల్లి: ప్రభుత్వం గొప్పగా ప్రచారం చెప్పుకుంటున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రకటనలకే పరిమితమవుతోంది. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తు స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెబుతున్నప్పటికీ పారిశుధ్య సమస్యలు మాత్రం ఎక్కడికక్కడే తిష్ట వేసుకున్నాయి. కాలనీలన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. మండల కేంద్రాల్లోనే సమస్యలు ఇలా ఉంటే ఇక మారుమూల పల్లెల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో మండల కేంద్రం నక్కపల్లి వెంకటనగర్ కాలనీని సమస్యలు వెంటాడుతున్నాయి. సుమారు 150 కుటుంబాలకు చెందిన 500 మంది నివసించే ఈ కాలనీలో పారిశుధ్య సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో వాడుక నీరు బయటికి వెళ్లేందుకు మార్గం లేదు. గతంలో కాలువ పనులు చేపట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో ఎక్కడికక్కడ మురుగు నీరు నిల్వ ఉండిపోయి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. వీధి కాలువలు సైతం అంతంతమాత్రంగానే ఉన్నాయని కాలనీ వాసులు చెబుతున్నారు.

జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలో ఈ కాలనీ ఉంటుంది. నివాసాల మధ్యలో వీధి కాలువలు ఉన్నాయి. ఇళ్లల్లో వాడుక నీరు అంతా వీధి కాలువల ద్వారా బయటికి వెళ్లి ప్రధాన కాలువలో చేరాల్సి ఉంటుంది. కాలువల్లో పూడిక తీత సరిగ్గా చేపట్టపోవడం, ప్రధాన కాలువ కూడా అధ్వానంగా ఉండడంతో దుర్గంధం అలుముకుంది. కాలువల్లో పూడిక తీత చేపట్టపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి పోయి కాలువలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని కాలనీ వాసులు చెబుతున్నారు. ప్రభుత్వం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గొప్పగా ప్రచారం చేసుకుంటుందని, మండల కేంద్రంలో ఉన్న కాలనీల వైపు మాత్రం ఎవరూ కన్నెత్తి చూడటం లేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ నిర్లక్ష్యం కారణంగానే కాలనీలో కనీస సదుపాయాలు కరువవుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2004లో రాజీవ్‌నగర్‌కాలనీ ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖనుంచి భూమిని కొనుగోలు చేసి 200 మందికి పట్టాలు పంపిణీ చేయడంతో వారు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. ఈ కాలనీలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. వీధి కాలువలు, రోడ్లు లేక కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇది కూడా నక్కపల్లికి కిలోమీటర్ దూరంలోనే ఉంటుంది. కాలనీకి వెళ్లేందుకు ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా ఉంటుంది. ఈ కాలనీలో కూడా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దుర్గంధంతో ఇక్కట్లు..



దుర్గంధభరితంగా ఉన్న కాలనీలో నివసించేందుకు ఇబ్బంది పడుతున్నాం. నెలల తరబడి కాలువలు శుభ్రం చేయలేదు. దీంతో అనారోగ్యం పాలువుతున్నాం. కిటికీలు, తలుపులు మూసుకుని ఇళ్లల్లోనే మగ్గిపోవాల్సి వస్తోంది. ఇంత దారుణమైన కాలనీలను ఎక్కడా చూడలేదు. పంచాయతీ సిబ్బంది ఎవరూ మా కాలనీవైపు కన్నెత్తి చూడటం లేదు. ఇలా ఎంతకాలం? అధికారులు స్పందించి కాలువల్లో మురుగు తొలగించాలి.

– కొల్నాటి వరలక్ష్మి, వెంకటనగర్‌కాలనీ

వాసన భరించలేకపోతున్నాం..



వెంకటనగర్ కాలనీలో కాలువలు సరిగా లేవు. ఎక్కడికక్కడ నీరు నిల్వ ఉండిపోతోంది. వాసన భరించలేకపోతున్నాం. పిల్లలయితే రాత్రిపూట పడుకోడానికి ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ వారు కనీసం నెలకి ఒకసారైనా శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లించడం వంటివి చేయడం లేదు. నరకం అనుభవిస్తున్నాం. మురుగు నీరు పోయే దారి లేక అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయించాలి.

– బోద రాజేశ్వరి, నక్కపల్లి

చర్యలు తీసుకుంటాం..



ప్రధాన గ్రామాలతో పాటు, ప్రతి కాలనీలో సాస్‌లో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వెంకటనగర్‌కాలనీ విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. వెంటనే పారిశుధ్య సిబ్బందిని పంపించి పూడిక తీత పనులు మొదలుపెడతాం. క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– సీతారామరాజు, ఎంపీడీవో

ఉచిత హోమియో వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తులసీ

మునగపాక: స్థానిక పల్లపువీధిలోని సాంబశివ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విశ్వ మానవతా సంస్థ, గణేష్ బెస్ట్ మార్కెట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ తులసీ వైద్య సేవలందించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య అలవాట్లను మార్చుకోవాలన్నారు. పోషక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తాజా ఆహారం తీసుకోవాలని జంక్ ఫుడ్స్ జోలికి పోవద్దన్నారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, పెద్దలు సూరిశెట్టి కన్నారావు, దాడి శ్రీరామమూర్తి, ఆడారి లక్ష్మణరావు, టెక్కలి దేవకీ, దాడి సాంబశివ, కోరుకొండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: మండలలో ఎస్.రాయవరం, పెదగుమ్ములూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లలో చెట్టుకొమ్మలు, చిన్న చిన్న మరమ్మతులు నిమిత్తం ఈ అసౌకర్యం ఉంటుందన్నారు. ఎస్.రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివాపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు, పెదగుమ్ములూరు సబ్ స్టేషన్ పరిధిలో పెట్టుగొళ్లపల్లి, రామయ్యపట్నం, చెల్లాపురం, పెదబోదిగల్లం, సీతమ్మపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

బాబు మోసాలు ఇంటింట వివరిద్దాం

- నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ
- పులపర్తి, కృష్ణాపురం, గూండ్రుబిల్లి, లక్కవరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీకార్యక్రమం నిర్వహణ



కృష్ణాపురంలో రచ్చబండకు హాజరైన మహిళలు



లక్కవరంలో క్యూఆర్ కోడ్ చూపుతున్న కరణం ధర్మశ్రీ



పులపర్తిలో మాట్లాడుతున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



లక్కవరంలో నాటు ఆవుకు పూజ చేస్తున్న ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని యలమంచిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు మోసానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని విమర్శించారు. ఆదివారం యలమంచిలి మండలం పులపర్తి, కృష్ణాపురం, గూండ్రుబిల్లి, లక్కవరం గ్రామాల్లో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా లక్కవరంలో దేశీయ నాటు ఆవుకు పూజలు చేసిన ధర్మశ్రీ, ఆయా గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమాల్లో పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, కూటమి నాయకులు ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలను వంచించడంతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఏడాదే అన్ని పథకాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు ఏం చెప్తారో దాన్నే అమలు చేయడం ఒక్క జగన్‌కే సాధ్యమని నిరూపించారన్నారు. ఎన్నికల్లో గెలవడానికి సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీలు గుప్పించి వాటిని అమలు చేయకుండా మోసం చేసే నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది కేవలం చంద్రబాబునాయుడే అన్నారు. మోసం చేయడంతో పాటు వెన్నుపోటు పొడవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇలాంటి నాయకుడు చేసిన మోసాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వివరించాలన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లు విడుదల చేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయకపోవడంతో ఏడాది లోపే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని నాయకులు అభిప్రాయపడ్డారు.

బాబును నమ్మితే మోసం గ్యారెంటీ..

చంద్రబాబును నమ్మిన వారికి మోసం గ్యారెంటీ అనేందుకు ప్రస్తుత కూటమి పాలనే నిదర్శనమని సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ఊకదంపుడు హామీలిచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం పథకాన్ని ఏడాది తర్వాత అమలు చేయడంతో పాటు సవాలక్ష ఆంక్షలతో లక్షలాది మంది అర్హులైన లబ్ధిదారులకు పథకాన్ని దూరం చేసి అన్యాయం చేశారన్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానన్న హామీ ఊసెత్తడం లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి ధనవంతులు, పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూర్చుతున్న చంద్రబాబుకు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని అభిప్రాయపడ్డారు. ఎన్ని ఇబ్బందులెదురైనా ప్రజల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం చేయడం మానదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, యలమంచిలి మండలం పార్టీ పట్టణ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, బొద్దపు ఎర్రయ్యదొర, సీనియర్ నాయకులు సేనాపతి రాము, సుంకర కొండబాబు, మర్రి రాజు, సిద్ధా నూకేశ్వర్రావు, దూది నర్సింహమూర్తి, కంటే శ్రీను, గూండ్రుబిల్లి, కృష్ణాపురం సర్పంచులు నంబారు అప్పారావు, వర్రే నూకినాయుడు గాంధీ, రఘు(కృష్ణాపురం), గొర్లి వెంకట్, అచ్యుత రామరాజు(లక్కవరం), గూండ్రుబిల్లి మాజీ సర్పంచ్ ఎర్ర అప్పారావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

నక్కపల్లి: స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ తెలిపారు. మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. త్వరలో గ్రామాల్లో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమంపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందని పార్టీ మండలాధ్యక్షుడు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు హాజరు కావాలని కోరారు.

అచ్యుతాపురం రూరల్: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు కోరారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 9 గంటల నుంచి జగ్గన్నపేట, ఖాజీపాలెం, పెదపాడు, తిమ్మరాజుపేట గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

స్నేహితుని కుటుంబానికి బాసట



2005-2006 బ్యాచ్ విద్యార్థులు



స్నేహితుని కుటుంబానికి అందజేస్తున్న నగదు

అచ్యుతాపురం రూరల్: ప్రాణాపాయ స్థితిలో మొట్టమొదట ఆదుకునేది స్నేహ బంధమేనని అచ్యుతాపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2005–06 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు చాటిచెప్పారు. తమ సహవిద్యార్థి కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారంతా ఒక్కసారిగా కలుసుకుని ఆనందంతో పరవశించిపోయారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ తోటి స్నేహితుడు చెట్టుపై నుంచి జారిపడి ప్రమాదవశాత్తు మృతి చెందడంతో అతని కుటుంబానికి రూ.65 వేలు అందజేశారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



స్నేహితులతో సర్పంచ్ తాతాజీ

మునగపాక: మండలంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఉత్సాహంగా గడిపారు. వెంకటాపురం సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ) తన స్నేహితులతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఏటా స్నేహితుల దినోత్సవంలో భాగంగా ఇటువంటి కలయిక జరుగుతుందని తాతాజీ తెలిపారు.

సాగర తీరంలో సండే సందడి



పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. సండే వచ్చిందంటే చాలు సుదూర ప్రాంతాల నుంచి చాలా మంది ఆటవిడుపుగా పిల్లా పాపలతో తీర ప్రాంతాలకు చేరుకుంటారు. ఎండలు మండుతుండటంతో సేద దీరేందుకు వచ్చేవారి సంఖ్య పెరిగింది.

‘నీటి తీరువా వసూళ్లు నిలుపుదల చేయాలి’



మాట్లాడుతున్న రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు రాము

మునగపాక: నీటి తీరువా బకాయి వసూళ్ల నిలుపుదల చేయాలని రైతు సంఘ మండల ఉపాధ్యక్షుడు కాండ్రేగుల రాము డిమాండ్ చేశారు. ఆదివారం గవర్ల అనకాపల్లిలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేపట్టిన నీటి తీరువా వసూళ్ల ప్రక్రియను తక్షణమే విరమించుకోవాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. వ్యవసాయానికి నీరు పంట కాలువల ద్వారా పారడం లేదన్నారు. చెరువుల్లోనూ, గెడ్డల్లోనూ నీరు నిలువ ఉండడం లేదన్నారు. నీరు ప్రవహించలేని పరిస్థితుల్లో నీటి తీరువా ఎలా వసూళ్లు చేస్తారన్నారు. రైతులకు డిమాండ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల మహేశ్వరరావు, సీఐటీయూ నేత పెంటకోట జోగినాయుడు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

తిరోగమనంలో విద్యా రంగం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



సమావేశానికి హాజరైన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం తిరోగమనంలో ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ విమర్శించారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు నేటికీ రాలేదన్నారు. విద్యార్థులు ఫీజులు కట్టలేదని కళాశాల యాజమాన్యాలు టీసీలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఒక్క డిగ్రీ కళాశాల లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం హాస్టళ్లను దత్తత తీసుకోవాలన్న ఆలోచన వెంటనే విరమించుకోవాలన్నారు. తల్లికి వందనం ఇప్పటికీ చాలా మందికి రాలేదని వాపోయారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కార్మికులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు

నర్సీపట్నం : ఈ నెల 5న రాంబిల్లి మండలంలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. నర్సీపట్నం మున్సిపాలిటీ, బయపురెడ్డిపాలెంలో భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలు ఈ నెల 5న రాంబిల్లి మండలంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరుకావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై తీవ్రమైన విద్యుత్ భారం పడడంతో పాటు జవాబుదారీతనం లేకుండా పోతుందన్నారు.